క్లుప్తంగా

రైతులూ.. అధైర్య పడొద్దు !



ప్రత్తిపాడు: రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఉడుతూరి ఓంప్రకాష్ రెడ్డి తెలిపారు. తుఫాను ప్రభావంతో నీట నానుతున్న పంట పొలాల్ని ఏడీఏ టి. శ్రీనివాసరావు, ఏవో అరుణకుమారి పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఎన్ని ఎకరాలు సాగు చేశారు? ఎంత పంట నష్టం జరిగింది? పెట్టుబడులు ఎంత పెట్టారు? అనే వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. పంటను కాపాడుకునేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. ఈ సందర్భంగా ఉడుతూరి ఓంప్రకాష్ రెడ్డి అధికారులతో మాట్లాడారు. ఏ ఒక్క రైతూ నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ సిబ్బంది పరిశీలించి పంట నష్టం జాబితాల్ని తయారు చేయాలని కోరారు. రైతులు కూడా అధైర్యపడవద్దని, ప్రభుత్వం ఆదుకునే విషయంలో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని వివరించారు.

తుఫాన్ ప్రాంతాల్లో పోలీసుల సహాయక చర్యలు

గుంటూరు రూరల్: తుఫాను ప్రభావ ప్రాంతాల్లో నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ రాంబాబు సిబ్బందితో కలసి సహాయక చర్యలు చేపట్టారు. మంగళవారం మండలంలోని దాసుపాలెం గ్రామ శివారులో ప్రధాన రహదారిపై వాగు పొంగి పొర్లుతుండటంతో సీఐ, సిబ్బందితో కలసి కర్ర దుంగలను ఏర్పాటు చేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. గ్రామ శివారులో బుధవారం పొన్నూరు ప్రధాన రహదారిపై కాలువ నీరు రోడ్డుపై ప్రవహిస్తూ రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో సీఐ పొక్లెయిన్ సాయంతో రోడ్డుకు గండి కొట్టించారు. అనంతరం గండిని పూడ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గోర్లవారిపాలెం గ్రామ శివారులోని వాగు, జొన్నలగడ్డ గ్రామ శివారులోని వాగులు లోలెవల్ సప్టాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సిబ్బంది సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న తమ రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేసిన నల్లపాడు పోలీసులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ముంపు పంటల పరిశీలన



గుంటూరు రూరల్: వాగులు పొంగి ముంపునకు గురైన మిర్చి, పత్తి, ఇతర పంటలను దాసుపాలెం సర్పంచ్ ఎదురుపాక వెంకట్ బుధవారం వ్యవసాయ శాఖ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ ముంపునకు గురైన పంటల్లో నీటిని వెంటనే బయటకు పంపాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో గండ్లు కొట్టాలని సూచించారు. ముంపు ప్రభావం నుంచి పంటలు తట్టుకునేందుకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

• రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, మండల అధికారులు బుధవారం ప్రజాప్రతినిధులతో కలసి మండలంలోని చిన్నపలకలూరు, దాసుపాలెం, మల్లవరం, తురకపాలెం, తోకావారిపాలెం గ్రామాల్లో నీట మునిగిన మిర్చి, పత్తి, మినుము, పుగాకు తోటల్ని పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యంతో మాట్లాడారు. ఆయన సూచనల మేరకు సకాలంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల్ని రైతులకు తెలియజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు రైతులు, ప్రజల సమస్యలపై స్పందించి సత్వర చర్యలు చేపట్టారు. వలంటీర్ల సహాయంతో వెంగళాయపాలెం గ్రామంలో సురక్షిత ప్రాంతాలకు తరలించిన ప్రజల్ని పరామర్శించారు. కార్యక్రమంలో దాసుపాలెం సర్పంచ్ ఎదురుపాక వెంకట్, రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు



పెదనందిపాడు: మండలంలోని నల్లమడ, నక్కవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రవాహానికి కట్టలు తెగి గ్రామాల్లోకి వస్తాయని రైతులతో పాటు గ్రామస్తులు భయపడిపోతున్నారు. అన్నపర్రు వెంబడి ప్రవహించే నక్కవాగు ఉగ్రరూపం దాల్చింది. అన్నపర్రు, కొప్పర్రు గ్రామాల మధ్య ఆర్ అండ్ బీ రోడ్డుపై నిర్మించిన కల్వర్టు కోతకు గురైంది. మూడు రోజుల్లో మరమ్మతు చేయనున్నట్లు జేఈ శ్రీనివాసరావు తెలిపారు.

పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం

రైతులకు కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి , ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య హామీ



ఉప్పలపాడు శివారులో దెబ్బతిన్న మినుము పంటను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య , అధికారులు

పెదకాకాని: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి హామీ ఇచ్చారు. తుఫాన్ కారణంగా పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, తెనాలి మండలంలోని హాఫ్‌పేట, ఈమని గ్రామాల్లో దెబ్బతిన్న పంటల్ని కలెక్టర్‌తో పాటు పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ పరిశీలించారు. పంట నష్టంపై రైతులతో మాట్లాడారు. అధిక వర్షాలకు పంట పొలాల్లోకి చేరిన నీటిని సాధ్యమైనంత మేర బయటకు పంపాలని రైతులకు సూచించారు. కాలువల్లోని నీరే పొలాల్లోకి వచ్చి చేరుతోందని రైతులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. కాలువల్లో నీరు త్వరగా పారుదల కావడానికి నీటి పారుదల శాఖ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పంట నష్టాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళతానని తెలిపారు. పంట నష్టంపై సర్వే చేసి పరిహారానికి గానూ ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావం కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తెలిపారు. కాలువల్లో నీటి పరిమాణం తగ్గేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో శ్రీకర్, ఏడీఏ నున్న వెంకటేశ్వర్లు, రవీంద్రబాబు, ఉమామహేశ్వరరావు, పీడీ డ్వామా వెంకటశివరామిరెడ్డి, ఏవో పి. సంధ్యారాణి, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ నగేష్, శివాలయం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దంతాల వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, నేతలు పల్లెంపాటి శ్రీనివాసరావు, దంతాల శ్రీనివాసరావు, గుమ్మళ్ల వెంకట్రావు, మందాళ శివారెడ్డి, జొన్నల అవినాష్‌రెడ్డి, భీమవరపు విజయలక్ష్మి, సయ్యద్ సుభాని, బందెల ఉదయ్‌శంకర్, రైతులు పాల్గొన్నారు.



బీకేపాలెంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో కిరణ్మయి



గార్లపాడులో నీట మునిగిన పొగాకు తోట

ప్రతి రైతుని ప్రభుత్వం ఆదుకుంటుంది

బీకేపాలెం(కాకుమాను): మిచాంగ్ తుఫాన్ కారణంగా పంటల్ని నష్టపోయిన ప్రతి రైతుని ప్రభుత్వం ఆదుకుంటుందని జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం తెలిపారు. మండలంలోని బీకేపాలెం, రేటూరు, అప్పాపురం, కాకుమాను గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాల్ని బుధవారం వ్యవసాయ శాఖ అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. ఏవో కె.కిరణ్మయి మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా 6,100 హెక్టార్లలో వరి, 1,232 హెక్టార్లలో శనగ, 192 హెక్టార్లలో పొగాకు, 64 హెక్టార్లలో మొక్కజొన్న, 52 హెక్టార్లలో మినుము పంట నీట మునిగినట్లు గుర్తించినట్లు ఆమె తెలిపారు. నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

• గార్లపాడులో నీట మునిగిన పొగాకు తోటల్ని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు పరిశీలించారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సత్వర చర్యలు

గుంటూరు రూరల్: తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సత్వర చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఇంటూరి పద్మావతి తెలిపారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. శివారు కాలనీల్లో ప్రజల పరిస్థితుల గురించి వాకబు చేశారు. పంట నష్టం వివరాలు త్వరితగతిన సేకరించాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వెంగళాయపాలెం పూలే కాలనీలో కొందరి ఇళ్లలోకి నీరు రావడంతో వారిని సురక్షిత ప్రాతానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఈవో పీఆర్డీ శ్రీనివాసరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ కరీముల్లా, దాసరి నాగరాజు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండ

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ఆదుకునేందుకు అన్ని చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య భరోసా కల్పించారు. మండలంలోని వెల్లలూరు పచ్చలతాడిపర్రు, మామిళ్ళపల్లి, ములుకుదురు, గొల్లమూడిపాడు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. వర్షాలకు నేలకొరిగిన వరి పొలాలు, ముంపునకు గురైన పనల్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అకాల వర్షంతో తడిసిన ధాన్యం, రంగు మారిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె. శ్రీకాంత్, వ్యవసాయ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు పాల్గొన్నారు.

ఇల్లు కోల్పోయిన కుటుంబానికి సాయం

మండలంలోని ములుకుదురులో భారీ వర్షం, ఈదురు గాలులకు ఇల్లు కోల్పోయిన మహిళకు తక్షణ సహాయంగా రూ.5 వేలను ఎమ్మెల్యే రోశయ్య అందించారు.



మహిళకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

పునరావాస కేంద్రాల్లో పూర్తి ఏర్పాట్లు

పెదకాకాని: తుఫాన్ పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వారికి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య తెలిపారు. నంబూరు యానాదికాలనీలో నివసిస్తున్న 60 కుటుంబాల వారికి జిల్లా పరిషత్ పాఠశాలలో, పెదకాకాని బాజీనగర్‌లో నివసిస్తున్న 40 కుటుంబాల గోండ్ల వారిని సమీపంలోని ప్రాథమిక పాఠశాలకు తరలించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. నంబూరు పునరావాస కేంద్రాన్ని బుధవారం సందర్శించిన ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నల అవినాష్‌రెడ్డి, పొన్నూరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ జొన్నల కరుణాకర్‌రెడ్డి, బందెల ఉదయ్ శంకర్, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని, పీఏసీఏస్ చైర్‌పర్సన్ భీమవరపు కోటిరెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి పాల్గొన్నారు.

చేబ్రోలులో...

మండలంలోని మంచాల, చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల పరిధిలో బుధవారం పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పర్యటించారు. దెబ్బతిన్న వరి పొలాలు, ధాన్యం రాశుల్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం గురించి, సమస్యల్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో పొన్నూరు ఏడీఏ వి. రామకోటేశ్వరి, ఏవో శ్రీనివాస నాయక్, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, వేజండ్ల సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, మంచాల గ్రామ సర్పంచ్ చందు బాబు, దంతాల శ్రీను, కె. అశోక్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మళ్లీ జగనే రావాలి

పొన్నూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు అన్నారు. పట్టణంలోని 7, 8 వార్డులలో బుధవారం ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజలకు వివరించారు. అనంతరం క్యాబిన్ పేటలోని 5 సచివాలయం పరిధిలో రూ.40 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలతో ప్రదర్శన బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బొద్దులూరు రంగారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఈ.ఎంఏ. మహమ్మద్, యం. అనీల కుమారి , గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వడ్డిముక్కలలో...

రాష్ట్ర ప్రజలు క్షేమంగా ఉండాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని ఎంపీపీ భవనం పద్మలీల అన్నారు. బుధవారం వడ్డిముక్కలలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి, జగనన్న ప్రజలకు చేసిన మేలును వివరించారు. సంక్షేమ పథకాల కరపత్రాల్ని పంపిణీ చేశారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ సచివాలయంలో అభివద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో ప్రదర్శించిన బోర్డును ఆవిష్కరించారు. వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షులు రుద్రపాటి ఆదిశేషులు గ్రామంలో పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మనోహర్, నాయకులు దాసరి శివరామకృష్ణ, సర్దార్ , సుధాకర్, కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వడ్డిముక్కలలో జెండాను ఆవిష్కరించిన నాయకులు

ప్రతి కుటుంబానికీ జగనన్న భరోసా

ముంపు ప్రాంతాల ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీ

గుంటూరు రూరల్: తుఫాన్ ప్రభావంతో ఇళ్లలోకి నీరు చేరిన ప్రాంతాల్లో ప్రజలకు స్థానిక వలంటీర్లు సత్వర సాయాన్ని ఉన్నతాధికారుల సహాయంతో అందించారు. వెంగళాయపాలెం పూలే కాలనీలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీరు చేరడంతో వలంటీర్లు 21 కుటుంబాలను స్థానిక పాఠశాలకు చేర్చారు. అనంతరం వారికి భోజన వసతిని కల్పించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఆరోగ్య పరీక్షలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ ఇంటూరి పద్మావతి, ఎంపీడీవో ఆదినారాయణ పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు స్థానిక అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుంటూరు వెస్ట్ తహసీల్దారు సాంబశివరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు నేతృత్వంలో ఇళ్లలోకి చేరిన నీటిని సుమారు ఐదు గంటలపాటు మోటార్లతో తొలగించారు. నీట మునిగిన ఇళ్ల పరిసర ప్రాతాల్లో పంచాయతీ సిబ్బందితో బ్లీచింగ్‌ను చల్లించి శుభ్రం చేశారు. ఆవాస కేంద్రాల్లో ఉన్న 21 కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు. లీటర్ నూనె, కేజీ ఉల్లిపాయలు, కూరగాయలు అందజేశారు. అనంతరం రిలీఫ్ క్యాంప్ నుంచి వారి ఇళ్లకు ప్రభుత్వ వాహనాల్లో తరలించారు.



పునరావాస కేంద్రంలో సరుకులు అందజేస్తున్న జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ ఇంటూరి పద్మావతి

పునరావాస కేంద్రంలో వసతి, భోజనం ఏర్పాటు



కొమ్మూరు పునరావాస కేంద్రంలో బాధితులకు భోజనం వడ్డిస్తున్న నేతలు

కొమ్మూరు(కాకుమాను): మండలంలోని కొమ్మూరులో అధిక వర్షాల కారణంగా ఇళ్లల్లోకి నీరు చేరి ఇబ్బందులు పడుతున్న పలు కుటుంబాలకు బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా ఏ ఒక్క కుటుంబం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముందస్తుగా తుఫాన్ ప్రభావం ఉన్న ప్రతి జిల్లాకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నీటి ఉధృతి తగ్గే వరకు గ్రామాల్లో పునరావాస కేంద్రాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గేరా జ్యోతి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

చేబ్రోలులో..

పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులకు ఇబ్బంది లేకుండా అధికారులు అండగా ఉండాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. వడ్లమూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు బుధవారం బియ్యం, నిత్యవసర వస్తువులను అందజేశారు. క్రోసూరు, ప్రత్తిపాడు మండలాలకు చెందిన 22 కుటుంబాలకు చెందిన 58మంది జీవనోపాధికి వచ్చి వడ్లమూడి గురువుపాలెం వద్ద లోతట్టు ప్రాంతంలో ముంపుబారిన పడటంతో అధికారులు పునరావాస కేంద్రంలో చేర్చారు. బుధవారం వారికి సివిల్ సప్లయి అధికారుల ద్వారా వచ్చిన బియ్యం బస్తాలు, కందిపప్పు, నూనె, కూరగాయలు నిత్యవసర వస్తువుల కిట్లను ఎమ్మెల్యే కిలారి పంపిణీ చేశారు. బాధితులకు పునరావాసంతో పాటు భోజన, వసతి సౌకర్యాలు కల్పించి, అత్యవసర సేవలు అందజేసిన తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ, రెవెన్యూ, పంచాయతీ సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ పల్లవి, తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ, ఎంపీడీవో బి. బాబూరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, పార్టీ నాయకులు షేక్ పెద మస్తాన్, షేక్ జాని, అహ్మద్, సాగర్, పంచాయతీ కార్యదర్శి వై.పి.ఏ. ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దాం

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: భారత రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ పాత్రను దేశం ఎన్నటికీ మరచిపోదని, ఆ మహనీయుడి అడుగు జాడల్లో మనమంతా నడుద్దామని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తెలిపారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం పొన్నూరు సెంటర్‌లో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే రోశయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, జై భీమ్ సభ్యులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు కూడా సామాజిక, ఆర్థిక సాధికారత సాధించాలని జీవితాంతం తపించిన గొప్ప దార్శనికుడు అంబేడ్కర్ అని ప్రశంసించారు. ఆయన ఆశయాల్ని ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి బడుగుల సాధికారత కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి చెందేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అంబేడ్కర్‌కు నివాళిగా పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌కు ఆయన పేరును పెట్టినట్లు తెలిపారు. పెత్తందార్ల పాలనలో దశాబ్దాలుగా అంబేడ్కర్ నామకరణానికి నోచుకోని సెంటర్‌ను వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోశయ్యను క్రిస్టియన్ నాయకులు మల్లెల రాజు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైఫుల్లా, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఎంఏ. మహమ్మద్, రుద్రపాటి ఆదిశేషులు, నాయకులు బొద్దులూరి రంగారావు, ఎల్. మనోహర్ రావు, జై భీమ్ సభ్యులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో..

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ షేక్ ఖాశింపీరా తెలిపారు. పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఖాశింపీరా మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు అంబేడ్కర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి పద్మారావు, ఉప సర్పంచ్ దివ్వి రాంబాబు, పెదనందిపాడు సొసైటీ అధ్యక్షుడు డి. నాగేశ్వరరావు, గేరా మోహనరావు, గేరా గణేష్, గుండ్రా పాపారావు, చెల్లి శ్రీను పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, దయాసాగర్

పెదకాకానిలో..

అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా లూథర్‌గిరి కాలనీలోని గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు.

చేబ్రోలులో..

అంబేడ్కర్ ఆశయాల్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని చేబ్రోలు మండల స్పెషల్ ఆఫీసర్ పల్లవి అన్నారు. చేబ్రోలు తహసీల్దారు కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ, ఎంపీడీవో బి. బాబూరావు, రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

కాకుమానులో..

స్థానిక ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అసమానతలు లేని సమాజం కోసం అంబేడ్కర్ పరితపించారని తెలిపారు. ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, గ్రామ మాజీ సర్పంచ్ నన్నపనేని కిశోర్‌బాబు, మెరిగల సుందరరావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య

కొమ్మూరులో..

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

గుంటూరు రూరల్: ప్రపంచ మార్గదర్శకుడు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మచిలీపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్‌తో కలసి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ సంబోధించిన సమానత్వం గత పాలకుల హయాంలో మాటలకే పరిమితం అయ్యిందని విమర్శించారు. కానీ నేడు జగనన్న కాలనీల్లో ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలతో పాటు అందరిని ఒకే చోట చేర్చి జీవనం గడిపే విధంగా సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సమానత్వం చాటారని తెలిపారు. మచిలీపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ మేకతోటి దయాసాగర్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రాథమిక విద్య నుంచి సాంకేతిక విద్య వరకూ తరతమ భేదాలు లేకుండా అందుతుందంటే దానికి అంబేడ్కర్ ఆశయాలేనని తెలిపారు. అనంతరం స్థానిక లాడ్జి సెంటర్‌లో ని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.